కథ

# అందం అంటే

''అందం అంటే ఏమిటిరా?'' విసుగ్గా ప్రశ్నించింది అమ్మ.

''.....''

''అసలు నీ దృష్టిలో సౌందర్యానికి నిర్వచనం ఏమిటో చెప్తావా?''

అమ్మ ప్రశ్నకు సమాధానం ఇవ్వకపోవడంతో ఒకింత కోపంగా అడిగారు నాన్నగారు. ఈసారి కూడా మౌనమే నా జవాబయ్యింది.

''ఏరా?'' తిరిగి ఆయన రెట్టించడంతో-

''నాకు తెలీదు నాన్నగారూ'' నాలో నేను గొణుక్కున్నట్టుగా చెప్పాను.

''తెలీదా...! లేక చెప్పటం ఇష్టం లేదా?''

''......''

''ఎన్ని సంబంధాలు చూసినా అమ్మాయి అందంగా లేదని తిరస్కరిస్తున్నావు కదా..''

''నిజమే చెప్తున్నాను నాన్నగారూ! అందానికి నిర్వచనం ఏమిటో నాకు తెలీదు'' ఈసారి కాస్తంత గట్టిగా, స్పష్టంగా చెప్పాను.

''తంతాను వెధవ! పిచ్చి పిచ్చి సమాధానాలు చెప్పావంటే...పెళ్లి చేసుకోకుండా ఇలాగే వుంటాను అంటావా, నీ ఇష్టం...! లేకపోతే అరవై ఏళ్లు వచ్చాక పెళ్లీ, షష్టిపూర్తి ఏకంగా ఒకసారే చేసుకుంటాను అంటావా. నాకేవిధమైన అభ్యంతరమూ లేదు. కానీ నీ ఉద్దేశ్యమేమిటో స్పష్టంగా చెప్పి ఏడు. ఒకటా! రెండా! దాదాపు పాతిక సంబంధాలు చూశాం. ప్రతిసారీ అదేమాట! నిజానికి నా ఆడపిల్లల విషయంలో కూడా నేనింత కష్టపడలేదు తెలుసా?''

''అబ్బబ్బ ఆపుదురూ! వాడు ఇప్పుడేగా వచ్చింది. రాగానే మొదలుపెట్టారు'' అంటూ విసుక్కుంది అమ్మ.

''నువ్వు మధ్యలో మాట్లాడకు. వాడొచ్చి ఎంతోసేపు కాలేదని నాకూ తెలుసు. కానీ ఈ విషయం ఇప్పుడు తేల్చుకోకపోతే వాడిక దొరకడని నీకు తెలీదు. వచ్చినప్పటినుంచీ స్నేహితుల్ని కలవాలంటూ ఊరమ్మట వూరేగుతాడు. ఎప్పుడో అర్ధరాత్రి ఇంటికి చేరతాడు. నేను పొలం వెళ్లే సమయానికి నిద్ర లేవడు. ఈలోపు ఆ పెట్టిన లీవు కాస్తా అయిపోతుంది. వెళ్లిపోతాడు. పోనీ ఉత్తరాలయినా రాస్తాడా అంటే ఆ ఆశా లేదు. మనం పది ఉత్తరాలు రాస్తే మన పోరుపడలేక ఒక్క కార్డు అది కూడా 'ఆ అమ్మాయి అందంగా లేదు, నాకు నచ్చలేదు' అని రాస్తాడు. అందంగా ఉండడం అంటే ఏమిటిరా? అంటే ఇదిగో ఇప్పుడు చెప్పాడుగా, అదీ సమాధానం...అసలు ఆ కళ్లకు ఏదయినా జబ్బు వచ్చిందో లేక ఏకంగా ఆ మైండే పాడై చచ్చిందో?'' విసుగ్గా కోపంగా అన్నారు నాన్నగారు.

''చాల్లెద్దురూ! మీ మాటలూ మీరూను. ఎదిగిన కొడుకుతో మాట్లాడే పద్ధతి ఇదేనా? నేనేమైనా కల్పించుకోపోతే 'నువ్వు మాట్లాడకు' అంటారు. ఆనక వాళ్లు మాట్లాడకపోతే 'ఏదో పెద్దవాడ్ని! కన్నతండ్రిని..ఓ మాట అనే చనువు అధికారం నాకు లేవా? వాళ్లకి కాస్త సర్ది చెబుదూ!' అని నా ప్రాణం తీస్తారు.'' అంటూ చిన్నగా నవ్వుతూ చెప్తుంటే ఆ సమయంలో అమ్మ, ఆవిడ మాటలు, ఆ దరహాసం నాకెంతో అందంగా అన్పించాయి.

''చాల్లే! నా రహస్యాలన్నీ పిల్లలకు చెప్పేస్తున్నావు కనకనే వాళ్ల ముందు నేను లోకువ అయిపోతున్నాను. ఇదిగో ఇప్పుడే చెప్తున్నాను...ఈసారి అయినా ఏదో ఒక సంబంధం ఖాయం చేశాడా సరే లేకుంటే ఈ జన్మలో పెళ్లయ్యే యోగ్యత వాడికి, చేసే అదృష్టం నాకు లేదనుకుంటాను తప్ప ఎవరినైనా సంబంధాలు అడగడం కానీ, పెళ్లి చూపులకి రావడం గానీ చేయను. సంబంధాలు చూసుకుంటారో, మానుకుంటారో మీ ఇష్టం. చిన్నప్పటినుంచీ అనుకున్న ఆ కృష్ణవేణిని చేసుకోరా అంటే చిన్నప్పుడు చూశాను...అందంగా వుండదు నాకొద్దు అంటాడు. వీడొచ్చాడని తెలిస్తే వాడొచ్చి ఏం నిర్ణయించుకున్నారు? అని అడుగుతాడు. వాడికి ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో అర్ధం కావడం లేదు. కనీసం సంబంధం అయినా కుదిరితే మావాడి స్నేహితుడి చెల్లెలనో, లేక మావాడు ఆ అమ్మాయిని ప్రేమించాడనో సర్దిచెప్పవచ్చు అంటే వీడేమో ఏమీ తేల్చడు'' ఆయాసంతో ఆగిపోయారు నాన్నగారు.

> ''ఇదంతా ఎందుకు చెప్పానో తెలుసా? మనం చూసే దృష్టిని బట్టి అవతలి వస్తువులోని రంగు, అందం గోచరిస్తుంది. 'యద్భావం తద్భవతి' అని అందుకే అంటారు. మన దృష్టి మనసు మీద ఆధారపడి ఉంటుంది. నీ మనసులో నీవే భావాన్ని నాటుతావో దాన్నే నీ కనులు చూస్తాయి. నీ చెవులు వింటాయి అంటే నీ ఇంద్రియ నడవడి నీ మనసుకు అనుగుణంగా ఉంటుందన్నమాట''

ఆయన్ని బాధపెడుతున్నందుకు నాకూ బాధగానే వుంది. కానీ ఏం చేయను? నాకెందుకో ఏ అమ్మాయీ నచ్చడం లేదు. అమ్మాయిని చూడగానే ఈమెతో కలిసి జీవితాంతం బ్రతకాలన్న కోరిక కలగాలి. ఆమె సమక్షం ప్రశాంతతకు నిర్వచనమవాలి. నాలో ఆత్మవిశ్వాసం జాగృతమయి...ఏ సమస్యనయినా ధైర్యంగా ఎదుర్కోగలనన్న నమ్మకం కలగాలి. ఇవేమీ లేకపోవడం వల్ల కాబోలు నాకే అమ్మాయీ (నేను చూసినంత వరకు) అందంగా అనిపించలేదు. అలా అని అందానికి నిర్వచనమేమిటి? అని ఎవరైనా ప్రశ్నిస్తే నేను చెప్పలేను. ఎందుకంటే పూర్తి సమాధానం నాకు కూడా తెలీదు కాబట్టి.

ఇక కృష్ణవేణిని ఎప్పుడో చిన్నప్పుడు చూశాను. మా ఇద్దరిదీ ఒకే ఊరయినా తను పట్నంలో వాళ్ల బాబాయి దగ్గర పెరగడంతో మా మధ్య పెద్దగా పరిచయం లేదు. ఆ అమ్మాయి చదువు పూర్తయి ఇక్కడకు వచ్చేసరికి నేను ఉద్యోగ నిమిత్తం పట్నం వెళ్లిపోయాను కాబట్టి ఈమధ్య కాలంలో మేం ఎప్పుడూ కలుసుకోలేదు.

''పిల్ల కాస్త రంగు తక్కువైతే ఏంరా? బంగారు బొమ్మ! మహాలక్ష్మి! ఎమ్.ఏ చదివింది. ఎప్పుడో చిన్నప్పుడు చూసిన దాన్ని మనసులో పెట్టుకుని ఏదో ఊహించుకుంటే ఎలా? ఈసారి వచ్చినప్పుడు అమ్మాయిని చూడు...నచ్చకపోతే అప్పుడు ఆలోచిద్దాం!'' అని అమ్మ అంటే తప్పక చూస్తానని ఆవిడకు మాట ఇచ్చాను.

ఇంకా ఏదో అనబోతుండగా అదృష్టవశాత్తూ మా పాలేరు రావడం, అతనితో కలసి నాన్నగారు బయటకు వెళ్లడంతో ఆ చర్చకు అంతటితో తెర పడింది.

★ ★ ★

ఊళ్లోకి రాగానే స్నేహితులందరినీ పలకరించే నేను అందుకు భిన్నంగా ఆరోజంతా ఇంట్లోనే ఉండిపోయాను. అందుకు ఒక రకంగా మా అన్నయ్య కూతురు కూడా కారణమేలెండి. తన బోసి నోరంతా తెరుచుకుని నవ్వుతుంటే ఆ నవ్వులో సిరిమల్లె స్వచ్ఛత, వెన్నెలమ్మ చల్లదనం నన్ను పలకరించాయి. నిజంగా అందానికి నిర్వచనం 'పసిపాప నిష్కల్మషమైన చిరునవ్వే' అని చెప్పాలని కూడా అనిపించింది.

ఆరోజు నాన్నగారు వచ్చేసరికి నన్ను ఇంట్లో చూసి ఆశ్చర్యపోయారు. ఆ రాత్రి అందరం కలిసి భోజనాలకు కూర్చున్నాం. అన్నయ్య, నాన్నగారు కొంతసేపు పొలం విష

యాలు మరికాసేపు ఆ ఊరి రాజకీయాలు గూర్చి మాట్లాడుకున్నారు. ఆ తర్వాత సంభాషణ నా ఉద్యోగం వైపు మళ్లింది. క్రమంగా గాలి ఎటు తిరుగుతుందో అనుభవమే కనక గబగబా తిని అక్కడి నుంచి లేవడం ఉత్తమమనుకుంటుండగా అమ్మ తన మతిమరుపుకి నొచ్చుకుంటూ...

''అన్నట్టు చెప్పడం మరిచాను. భూపతిగారి భార్య మిమ్మల్నోసారి వాళ్లింటికి రమ్మనమని చెప్పింది'' అంది.

''ఎందుకు?'' అన్నారు నాన్న.

''వాళ్లబ్బాయి ఎవర్నో ప్రేమించాడట. పెళ్లంటూ చేసుకుంటే ఆ అమ్మాయినే చేసుకుంటానని భీష్మించుకుని కూర్చున్నాడుట. భూపతి గారేమో నా కంఠంలో ప్రాణం ఉండగా కులాంతర వివాహానికి అంగీకరించనని పట్టుదల పట్టారట. ఆవిడ అటు భర్తకు, ఇటు కొడుకుకు నచ్చచెప్పలేక మధ్యలో నలిగిపోతోంది'' అంది అమ్మ.

''ఇంతకీ అసలు ఆవిడ అభిప్రాయం ఏమిటి?'' ఆసక్తిగా అడిగారు నాన్న.

''ఆవిడ కొడుకునే సమర్థిస్తోంది...కాలంతోపాటు వచ్చే మార్పులను హుందాగా స్వీకరించాల్సిందిపోయి పెద్దవాళ్లం మనమే నా మాటే చెల్లాలని పట్టుబడితే వయసులో వున్న వారికెంత పట్టుదల ఉంటుందీ? వాడి సుఖ,సంతోషాలు ముఖ్యమైనప్పుడు...అదేదో వాడు మనసుపడ్డ పిల్లనిచ్చి చేస్తే సరిపోతుందిగా! కులం పట్టింపు చేసుకునే వాడికి లేనప్పుడు మనకెందుకు అంటుంది. దానికి తోడు కృష్ణవేణీ కూడా 'ఆ అమ్మాయిని మీరు కోడలిగా తెచ్చుకుంటున్నారంటే మీ ఇంటి పేరిటది అయిపోతుంది కదా! ఆ అమ్మాయి కులం ఏమైనా పెళ్లయ్యాక మీ అమ్మాయి అవుతుంది. జీవితాంతం మీ కులం పేరుతోనే చెలామణీ అవుతుంది. ఇంత చిన్న విషయం కోసం మీ అబ్బాయిని బాధపెట్టి మనస్పర్థలు తెచ్చుకోవటం దేనికి? రేపు మీ కోపతాపాలు తగ్గిన తర్వాత కొడుకు కోడలుని ఆహ్వానించారనుకుందాం...మీ అబ్బాయి మీమీద ఉన్న ప్రేమాభిమానాల వల్ల జరిగినదంతా మర్చిపోవచ్చు, కానీ మీ కోడలు మర్చిపోగలదా? అని అనడంతో ఆవిడ ఆయనకు నచ్చజెప్పే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇదంతా చూసి ఆయనేమో 'నీ అలుసు చూసుకునే వాడలా తయారయ్యాడు' అంటూ ఆవిడ మీద రంకెలు వేస్తున్నారట. ఆవిడవల్లకాక...మిమ్మల్నోసారి వచ్చి మీ స్నేహితుడ్ని సమాధానపరచమని చెప్పింది'' అంటూ అసలు కారణం వివరించింది అమ్మ.



నాన్నగారు ఏమీ మాట్లాడకపోవడంతో అన్నయ్య ''కులాంతర వివాహాలపై మీ అభిప్రాయం ఏమిటి నాన్నగారూ?'' అని అడిగాడు.

''ఏం...నీ తమ్ముడేమైనా రాయబారం నడపమన్నాడా? అలాంటిదేమైనా ఉంటే ప్రేమించానని ధైర్యంగా చెప్పలేనివాడు ప్రేమించడానికి అనర్హుడని చెప్పు'' అన్నారు నాన్న నావంక చూస్తూ.

''అలాంటిదేం లేదు నాన్నగారూ! జస్ట్ మీ అభిప్రాయం తెలుసుకుందామని...'' అన్నాడు అన్నయ్య.

''సరే విను...! అడ్జస్ట్‌మెంట్ ఈజ్ ద సీక్రెట్ ఆఫ్ లవ్ అంటారు. నిరాడంబరత, సర్దుబాటు ఈ రెండూ ఉంటేనే

కె. శైల

ప్రేమ అయినా, వివాహమయినా సక్సెస్ అవుతుంది. ఈ ప్రపంచంలో ఏ ఇద్దరి వ్యక్తుల అభిప్రాయాలు, అభిరుచులు పూర్తిగా కలవవు. ప్రతి వ్యక్తీ ఓ నూతన సృష్టి అని అందుకే అంటారు. అలాంటి ఇద్దరు భిన్నవ్యక్తులు వివాహ బంధంతో ఒకటైనప్పుడు ఒకరికోసం ఒకరు కొన్ని సర్దుబాట్లు చేసుకోవాల్సి వస్తుంది. అలా అడ్జస్ట్ అవడం చిన్నతనంగా భావించే వారు అయితే కొట్టుకుంటూనో లేక విడిపోయో బ్రతుకుతున్నారు. కులమతాలు వేరైతే ఆచార వ్యవహారాలు ఆహారపు అలవాట్లలోని తేడాలవల్ల సర్దుబాటుకు మరికాస్త ఎక్కువ సమయం పడుతుంది. ఈలోగా వారి మధ్య ప్రేమ నశించి, వివాహం గొడవలతో అంతమవుతుందేమోనన్న భయం వల్ల పెద్దవారు పిల్లల ప్రేమ వివాహానికి అభ్యంతరం చెపుతుంటారు. ఎవరి వ్యక్తిత్వాన్ని వారు నిలుపుకుంటూ, ఒకరి కోసం ఒకరు చిన్న చిన్న త్యాగాలు చేసుకోగలిగితే కులాంతరమైనా, మతాంతరమైనా ఆనందంగానే బ్రతకచ్చు. అది లేకపోతేనే సమస్య...''

అంటూ ఊపిరి పీల్చుకోడానికి ఒక్క క్షణం ఆగారు. నాన్నగారి వంక ఆశ్చర్యంగా చూస్తుండిపోయాను.

''భార్యాభర్తలు వాస్తవానికి ఇద్దరయినా వారి మనసు ఒకటే కావాలి. అది కూడా అవిభాజ్యంగా ఉండాలి. వారు ఒకేమాట, ఒకే చూపు, ఒకటే నడకతో జీవించాలన్నది అర్ధనారీశ్వర అవతార వైశిష్ట్యమని చెప్తారు. వారి ప్రేమ ఇంటికి పునాది కావాలి. ఒకరి మీద ఒకరికి ఉన్న నమ్మకం ఆ ఇంటికి సింహద్వారం కావాలి. అవగాహన, అర్థం చేసుకోవడం ఆ ఇంటి పై కప్పు కావాలి. ఈ మూడు ధృడంగా వున్న ఇంట్లో ఓర్పు, శాంతి, క్షమ, త్యాగం, నిస్వార్థం లాంటివి కొలువుతీరి ఆ ఇంటిని నలుదిశలా పదిలంగా కాపాడుతాయి. ఆ ఇంటిని స్వర్గంగా మారుస్తాయి. ఎప్పుడైతే పునాది కదులుతుందో ఆ ఇంటి పై కప్పు కూలిపోతుంది. ఇక ఆ సంసారాన్ని నిలబెట్టడం ఎవరితరమూ కాదు...'' ఒక రకమైన ఉద్వేగంతో అన్నారు నాన్నగారు.

ఆయన మాటలలో ఎంతో సత్యం అంతకు మించి అనుభవం ఉందనిపించింది. ఏ ఇంటి చిత్రాన్ని అయినా ప్రేమ, నమ్మకం, అవగాహన, అర్థం చేసుకోవడం, గౌరవం, సంతృప్తి, శాంతి...అనే ఏడు రంగులతో చిత్రిస్తే ఆ చిత్రం ఇంద్రధనుస్సే అవుతుంది.

★ ★ ★

మరుసటి రోజు సాయంత్రం చంద్రం ఇంటికి వెళ్లాను. చంద్రం కృష్ణవేణి అన్నయ్య. నన్ను చూడగానే చంద్రం అమ్మగారు చిరునవ్వుతో ఆహ్వానించి కుశలప్రశ్నలు వేశారు. ''చంద్రం మేడమీద ఉన్నాడనుకుంటానయ్యా, పిలుస్తానుండు...'' అని లేవబోతుంటే ఆవిడను ఉండమని నేనటువైపు నడిచాను. చివరిమెట్టు పై ఉండగా అక్కడేవో మాటలు వినిపిస్తుండడం, అందులోనూ నా ప్రశ్నే వినబడి ఆగిపోయాను.

''చెప్పు లలితా...అందం అంటే ఏమిటి?'' అడిగింది ఓ అమ్మాయి.

''నాకు తెలీదు కృష్ణా!'' అంది ఆ లలిత అనబడే అమ్మాయి. దాన్నిబట్టి అక్కడ ఇద్దరమ్మాయిలు ఉన్నారని ఒకరు లలిత, మరొకరు కృష్ణవేణి అని అర్థమైంది.

''లలితా! ఓసారి సమర్థ రామదాసు తను రాసిన రామాయణాన్ని శిష్యులకి చదివి వినిపిస్తుంటే హనుమంతుడు కూడా వినడానికి వచ్చాడట. హనుమంతుడు అశోక వనానికి వెళ్లి అక్కడ తెల్లని పూలని చూచెను అని రామదాసు చదువుతుంటే హనుమంతుడు ప్రత్యక్షమై నేను చూసినవి తెల్లని పూలు కాదు, ఎర్రనివి అన్నాడట. అందుకు రామదాసు లేదండీ...మీరు చూసినవి తెల్లని పూలేనని వాదించాడట. దాంతో హనుమంతుల వారికి కోపం వచ్చి అక్కడికి స్వయంగా వెళ్లి చూసింది నేనయితే నాదే అబద్ధమంటావా? అన్నాడట. చివరకు ఇద్దరూ కలిసి శ్రీరామచంద్రుడి దగ్గరకు వెళితే ఆయన నవ్వి మీరిద్దరు చెప్పింది సత్యమే...హనుమంతుని కనులు కోపంతో ఎరుపెక్కడం వల్ల తెల్లని పూలు ఎర్రని పుష్పాలుగా కన్పించాయి...అని చెప్పాడట''

''ఇదంతా ఎందుకు చెప్పానో తెలుసా? మనం చూసే దృష్టిని బట్టి అవతలి వస్తువులోని రంగు, అందం గోచరిస్తుంది. 'యద్భావం తద్భవతి' అని అందుకే అంటారు. మన దృష్టి మనసు మీద ఆధారపడి ఉంటుంది. నీ మనసులో నీవే భావాన్ని నాటుతావో దాన్నే నీ కనులు చూస్తాయి. నీ చెవులు వింటాయి అంటే నీ ఇంద్రియ నడవడి నీ మనసుకు అనుగుణంగా ఉంటుందన్నమాట''

''అందం అంటే కేవలం తెల్లగా ఉండడమేనా? వ్యక్తిత్వం, సంస్కారం, విచక్షణా జ్ఞానం లాంటివేమీ అవసరం లేదా? మనిషి గొప్పదనం అందం నలుపు తెలుపుల లోనే ఉంటుందా?''

''లలితా! ఆరోగ్యంగా ఉండటమే అసలైన అందం. ఈ శారీరక ఆరోగ్యానికి కూడా కావాల్సింది మానసిక సౌందర్యమే. అసూయాద్వేషాలు, కక్షలు, కార్పణ్యాలకు దూరంగా ఉండి, ప్రేమ, ఓర్పు, ఆదరణలను మనసులోకి ఆహ్వానించగలిగిన వారే అందమైన వారు. ఇతరులను ప్రేమగా పలకరించడం, చేతనైతే సాయం చెయ్యడం, ఎవరి గూర్చి చెడుగా మాట్లాడకపోవడం, ఇతరులకుందని ఏడవకుండా ఉన్నదానితో సంతృప్తి పడగలిగినవారే నా దృష్టిలో అద్భుత సౌందర్యవంతులు...''

కృష్ణవేణి మాటలతో నా కళ్ల ముందు కమ్ముకున్న మైకపు పొరలు విడిపోయాయి. నాలోని అస్పష్ట భావానికి ఓ రూపం ఏర్పడింది. అన్నింటిని మించి నాన్నగారు కృష్ణవేణిని నా భార్యగా ఎందుకు నిర్ణయించారో అర్థమైంది. అందం అంటే నిర్వచనం వ్యక్తిత్వం. దీనిలోంచే ఆమె చెప్పినవన్నీ వస్తాయి. వ్యక్తిత్వం లోపించిన అందం మేడిపండు చందమే కదా!

నేను క్రిందకు దిగి వచ్చేసరికి చంద్రం ఎదురయ్యాడు. ''మధూ! నేను మీ ఇంటి నుంచి వస్తున్నాను. నువ్వేమో ఇక్కడున్నావు'' అంటూ అప్పుడే క్రిందకు వచ్చిన చెల్లెల్ని చూసి, ''మధూ! మా చెల్లాయి కృష్ణవేణి'' అంటూ పరిచయం చేశాడు. చిరునవ్వుతో చేతులు జోడించి నమస్కరించింది కృష్ణవేణి.

'కాస్తంత రంగు తక్కువైతే ఏంరా!? పిల్ల బంగారు బొమ్మ' అన్న అమ్మ మాటలు యదార్థమే. అన్నింటిని మించి ఆమె చిరునవ్వులో చల్లదనం ఉంది. ఆమె సాన్నిధ్యం ప్రశాంతతకు నెలవన్పించింది. ఇక ఆమె మధుర భాషణం గూర్చి చెప్పనక్కర్లేదుగా...

''మధూ!'' అంటూ వాడేదో చెప్పబోతుంటే-

''ఇకనుంచి 'బావగారూ!' అనరా..'' అని వచ్చేస్తూ కృష్ణవేణి వంక చూసాను. ఆమె సిగ్గుతో తలవంచుకుంది.

ఇంటికి వచ్చేసరికి హాల్లో అందరూ కూర్చుని మాట్లాడుకుంటున్నారు. ''భూపతిగారు వాళ్ళ అబ్బాయి ప్రేమను అంగీకరించారని'' అమ్మ చెప్తుంటే వెళ్ళి అమ్మ ప్రక్కన కూర్చుని ''అమ్మా! మీ ఇష్టప్రకారం నాన్నగారి స్నేహితుడి కూతుర్నే పెళ్ళిచేసుకుంటాను'' అన్నాను నెమ్మదిగా.

''ఏమిటీ! కృష్ణవేణిని... ఆ నల్లపిల్లను పెళ్ళిచేసుకుంటావా?'' ఆశ్చర్యంగా అడిగారు నాన్నగారు.

అవునన్నట్టు తలాడించి ''కాస్తంత రంగు తక్కువైతే ఏం? పిల్ల బంగారు బొమ్మ'' అన్నాను అచ్చంగా అమ్మ మాదిరిగా...

నాన్నగారు, అన్నయ్య ఆనందంగా, వదిన అభిమానంగా నావంక చూస్తుంటే అమ్మ ఆప్యాయంగా నన్ను దగ్గరకు తీసుకుని మురిపెంగా నుదుటి మీద ముద్దుపెట్టుకుంది.

ఇక్కడో చిన్న విషయం చెప్పాలి. చాలామంది వ్యక్తిని ప్రేమించటం ప్రేమనుకుంటారు కాని వ్యక్తిత్వాన్ని ప్రేమించడమే అసలైన ప్రేమ అని తెలుసుకుంటే ఆ ప్రేమలో వైఫల్యమే ఉండదు.

☆

